# ఇంటింటికే వెళ్లాలి--

## సచివాలయానికి పిలిస్తే చర్యలు--
## అర్బన్ తాసిల్దార్ శ్రీనివాసులు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 25:ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) తప్పనిసరిగా ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల ద్వారా ఓటర్ల వివరాలను సేకరించాలని అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు.గురువారం నంద్యాల పట్టణంలోని మైనస్సార్ నగర్ 38వ వార్డు సచివాలయాన్ని సందర్శించిన ఆయన, బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలను నమోదు చేయాలని సూచించారు.ప్రజలను సచివాలయాలకు పిలిపించి వివరాలు సేకరించడం సరైన విధానం కాదని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి ప్రజలను సచివాలయానికి రప్పించి ప్రక్రియ నిర్వహిస్తే, సంబంధిత అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని, ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని బీఎల్ఓలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు లేకుండా విధులు నిర్వహించాలి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 25:నంద్యాల జిల్లా పోలీసు పరిపాలన విభాగ సిబ్బందితో జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎన్. యుగంధర్ బాబు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశంలో వివిధ విభాగాల పనితీరు, పెండింగ్ అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా సిబ్బందికి రావాల్సిన అన్ని ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైద్య బిల్లులు, ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్ రుణాలు, ఇంక్రిమెంట్లు, టీఏ బిల్లులు, వేతన బకాయిలు పెండింగ్‌లో లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.అలాగే సీనియారిటీ, పదోన్నతులకు సంబంధించిన రికార్డులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో పరిపాలన విభాగ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# చెంచయ్య హోటల్ ప్రారంభం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 25: నంద్యాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన చెంచయ్య హోటల్‌ను గురువారం అర్బన్ తహసీల్దార్ శ్రీనివాసులు ప్రారంభించారు. అనంతరం హోటల్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారంలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామ సంజీవరావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది, హోటల్ నిర్వాహకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా హోటల్‌లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను అధికారులు పరిశీలించి అభినందించారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.



# ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికి చీకటి అధ్యాయం: అభిరుచి మధు

## --పౌర హక్కులు, పత్రికా స్వేచ్ఛను అణచివేశారని విమర్శ-

–విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 25:భారత ప్రజాస్వామ్య చరిత్రలో 1975లో విధించిన ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయమని, అది రాజ్యాంగంపై జరిగిన ప్రత్యక్ష దాడేనని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు. ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దేశాన్ని నియంతృత్వ పాలన వైపు నడిపించి, ప్రజాస్వామ్య విలువలను తీవ్రంగా దెబ్బతీసిందని ఆయన విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను నిలిపివేసి, ప్రజల పౌర స్వేచ్ఛలను హరించిందని ఆరోపించారు.



ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలను పెద్దఎత్తున అరెస్టు చేసి జైళ్లకు పంపిన ఘటనలను దేశ ప్రజలు మరువలేరని అన్నారు.ఎమర్జెన్సీ కాలంలో పత్రికలపై కఠినమైన సెన్సార్ విధించి, భావప్రకటన స్వేచ్ఛను పూర్తిగా అణచివేశారని అభిరుచి మధు విమర్శించారు. ప్రజల గొంతుకగా నిలిచిన మీడియాను నియంత్రించి, ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభాలైన స్వతంత్ర సంస్థలపై కూడా ఒత్తిడి తీసుకువచ్చారని పేర్కొన్నారు.భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థ దేశానికి బలమైన పునాదులని, వాటిని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చీకటి రోజులు మళ్లీ రాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఎమర్జెన్సీ చరిత్రను ప్రతి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అభిరుచి మధు పేర్కొన్నారు.

# ఉడుమాల్‌పురంలో ఖేత్ బచావో అభియాన్--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 25: మహానంది వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఉడుమాల్‌పురం గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అసోసియేట్ డీన్ డా. సి.హెచ్. శ్యామ్ రాజ్ నాయక్ రైతులకు భూసార పరీక్షల ప్రాముఖ్యత, ఫలితాల ఆధారంగా ఎరువుల వినియోగం, జీవన ఎరువులు, సేంద్రీయ పదార్థాల సమీకృత వినియోగంపై అవగాహన కల్పించారు.నేల సారవంతతను పెంపొందించడం, నేల కాలుష్యాన్ని నివారించడం ద్వారా ఎరువుల వినియోగం తగ్గి, పంట దిగుబడులు మెరుగుపడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందని వివరించారు.కార్యక్రమంలో డా. ఎం. జ్యోత్స్న కిరణమయి, డా. ఎం. విష్ణుప్రియ, వి.ఎ.ఎ. సంజీవ్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# అమరావతి ప్రాంతాన్ని ఫ్రీ జోన్ గా ప్రకటించాలి.

## ప్రజా పరిరక్షణ సమితి నేతలు డిమాండ్.

రాయలసీమ, కోనసీమ ప్రాంత ఉద్యోగస్తులు నష్టపోకుండా చేయాలి × అందరిదీ అమరావతి అనేది మా వాదన శ్రీ ఆర్డర్స్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగస్తులను జోన్, మల్టీ జోన్స్ ప్రకారం వేరు చేసే ప్రక్రియ కు శ్రీకారం చుట్టింది. అందులో మేము అమరావతి ప్రాంతాన్ని ఫ్రీ జోన్ గా ప్రకటించాలి అని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె బలరాం గారు న్యాయవాది డిమాండ్ చేస్తున్నాం.అమరావతి ప్రాంత అభివృద్ధి ఫలాలు మా ప్రాంత ఉద్యోగస్తులు కూడా అనుభవించాలి. అప్పుడే అమరావతి కొందరిది కాదు అందరిది అనే భావన కలుగుతుంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సం౹౹ పరిధిని 'ఫ్రీ జోన్' గా ప్రకటించడం వల్ల రాయలసీమ ప్రాంత నిరుద్యోగులకు మరియు ప్రభుత్వ ఉద్యోగులకు సమాన అవకాశాలు, హక్కులు లభిస్తాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ ఫ్రీ జోన్ వివాదం వంటి అనుభవాల నేపథ్యంలో, అమరావతిని ఫ్రీ జోన్‌గా మార్చడం వల్ల రాయలసీమ ఉద్యోగులకు కలిగే ప్రధాన ప్రయోజనాలు ఉన్నాయి:సమాన ఉద్యోగ అవకాశాలు స్థానిక కోటా నిబంధనల మినహాయింపు: అఖీఆం ప్రాంతం ఫ్రీ జోన్ అయితే, అక్కడ కొత్తగా భర్తీ చేసే ప్రభుత్వ ఉద్యోగాల్లో కేవలం గుంటూరు, కృష్ణా (కోస్తా) జిల్లాల వారికే కాకుండా రాయలసీమ నిరుద్యోగులకు కూడా సమాన పోటీ అవకాశం లభిస్తుంది.20%-30% నష్టం నివారణ: ఒకవేళ ఫ్రీ జోన్ చేయకపోతే, రాజధాని ప్రాంత స్థానికులకే ప్రాధాన్యత దక్కి రాయలసీమ యువత దాదాపు 20 నుండి 30 శాతం ఉద్యోగ అవకాశాలు



కోల్పోయే ప్రమాదం తప్పుతుంది.ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాలు: హెడ్ ఆఫీసులు, సెక్రటేరియట్ నిర్వహణ కోసం తీసుకునే వేలాది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పోస్టుల్లో రాయలసీమ అభ్యర్థులు నేరుగా అర్హత సాధించవచ్చు.కెరీర్ వృద్ధి మరియు బదిలీలు రాజధాని విభాగాల్లో సులభమైన పోస్టింగులు: సచివాలయం డిపార్ట్‌మెంట్ హెడ్ ఆఫీసులు వంటి కీలక విభాగాలలో రాయలసీమ ఉద్యోగులు ఎలాంటి జోనల్ పరిమితులు లేకుండా సులభంగా బదిలీలుపొందవచ్చు.సీనియారిటీ ప్రయోజనాలు: ఫ్రీ జోన్ పరిధిలో పనిచేసేటప్పుడు జోనల్ బదిలీల వల్ల సీనియారిటీ నష్టపోయే ముప్పు ఉండదు. అందరికీ సమానమైన ప్రమోషన్ అవకాశాలు ఉంటాయి. పరిపాలన మరియు మౌలిక వసతుల లబ్ధి కీలక నిర్ణయాల్లో భాగస్వామ్యం: రాష్ట్ర నడిబొడ్డున ఉన్న రాజధాని పరిపాలనలో రాయలసీమ ఉద్యోగుల ప్రాతినిధ్యం పెరగడం వల్ల ఆయా వెనుకబడిన జిల్లాల సమస్యలపై ప్రభుత్వానికి మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది.భత్యాల ప్రయోజనాలు రాజధాని పరిధిలో పనిచేసే ఉద్యోగులకు ప్రభుత్వం కల్పించే ప్రత్యేక హౌస్ రెంట్ అలవెన్స్), సిటీ కాంపెన్సేటరీ అలవెన్స్ వంటి ఆర్థిక ప్రయోజనాలు రాయలసీమ ఉద్యోగులకూ సమానంగా అందుతాయి.మొత్తంగా, అఖీఆం ప్రాంతాన్ని ఫ్రీ జోన్ చేయడం వల్ల రాయలసీమ ఉద్యోగులు మరియు నిరుద్యోగులు రాజధాని నగర అభివృద్ధిలో సమాన భాగస్వాములుగా మారడానికి చట్టపరమైన రక్షణ లభిస్తుంది. ఈ కార్యక్రమంలో ప్రజా పరిరక్షణ సమితి నేతలు శ్రీ పద్మా నందా యోగి గారు డేవిడ్ రాజ్ పర్వతనేని హరి కుమార్ చంద్ర శ్రీరాములు నాయుడు శివమణి సూరి,చంద్రవంశీ రవి కుమార్, మురళి గారు, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలో ప్రజా సమస్యల స్వీకరణ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 25:ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'నెలలో నాలుగు గురువారాలు ? ప్రజల వద్దకు పాలన' కార్యక్రమంలో భాగంగా గురువారం గుంతనాల గ్రామంలో గ్రామసభ నిర్వహించినట్లు రూరల్ తహసీల్దార్ శ్రీవాణి తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన ఐదు వినతిపత్రాలు స్వీకరించినట్లు ఆమె తెలిపారు. అందిన అర్జీలను సంబంధిత శాఖలతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయాలని, ఎవరూ ఓటరు జాబితా నుంచి మిగిలిపోకుండా క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని తహసీల్దార్ శ్రీవాణి సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియలో ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామచందర్ రావు, రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, మండల సర్వేయర్ శివగోపాల్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# స్వాతి నక్షత్రాన నృసింహుడికి పంచామృతాభిషేకం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 25: నంద్యాల తెలుగు పేటలోని శ్రీ ఘణ మద్దులేటి లక్ష్మీ నృసింహా స్వామి దేవస్థానంలో స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా గురువారం ప్రత్యేక పంచామృతాభిషేకం వైభవంగా నిర్వహించారు.ఆలయ అర్చకులు మూలమూర్తి శ్రీ మద్దులేటి లక్ష్మీ నృసింహా స్వామివారికి వేదమంత్రోచ్చారణల మధ్య పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వాతి నక్షత్ర పూజా దాతల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు అభిషేకం చేసి, నూతన వస్త్రాలు, పుష్పమాలలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక నైవేద్యం సమర్పించారు. అనంతరం మహా మంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారి అభిషేకాన్ని వీక్షించి, ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.



# టెక్కే మార్కెట్ వద్ద కారు బీభత్సం--

## ఫుట్‌పాత్‌పై అరటిపండ్లు అమ్ముతున్న వృద్ధురాలిని ఢీకొట్టిన కారు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జూన్ 25 :నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికులను కలచివేసింది. ఫుట్‌పాత్‌పై కూర్చొని అరటిపండ్లు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్న ఓ వృద్ధురాలిపై ఓ కారు అదుపుతప్పి ఎక్కడంతో ఆమె తీవ్రంగా గాయపడింది.ఈ ప్రమాదంలో వృద్ధురాలికి రెండు కాళ్లు గాయాలు కావడంతో వెంటనే స్థానికులు స్పందించి ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోంది.ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ భారీగా ప్రజలు గుమిగూడారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యంగా, వేగంగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు. ఫుట్‌పాత్‌పై ఉన్న చిరు వ్యాపారుల భద్రతపై అధికారులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ప్రమాదానికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190